
# టీ-మీడియా
మెయిన్
సామాజికం.. ప్రజల పక్షం...
10 ANNIVERSARY Celebration
www.tmedia.net.in
సంపుటి : 8
సంచిక : 212
పేజీలు : 3
శనివారం 28.02.2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



డిజిటల్ మీడియా మిత్రులకు ఆహ్వానం
కేంద్ర ప్రభుత్వం రూపొందించిన
డిజిటల్ మీడియా ఇతిక్స్ కోడ్ 2021
అమలు కోసం, మన ఆత్మ గౌరవం కోసం,
జర్నలిస్టులుగా గుర్తింపు కోసం,
ఖమ్మం గడ్డ నుండి ఉద్యమానికి కార్యాచరణ చేద్దాం
సమిష్టిగా చర్చించి
కార్యక్రమం రూపొందిద్దాం
ఇట్లు
టీ-మీడియా కుటుంబం
తెలుగు డిజిటల్
సెల్ : 8919710365


## తెలంగాణకు కేంద్రం
# మరో శుభవార్త..



- రాష్ట్రానికి ప్రత్యేక నిధులు విడుదల



**టీ మీడియా, ఫిబ్రవరి 27, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం భారీ గుడ్ న్యూస్ అందించింది. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు అందాయి. తెలంగాణ ప్రభుత్వానికి ప్రోత్సాహకంగా కేంద్రం నిధులు విడుదల చేసింది. ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రోత్సాహకంగా రూ.424 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దేశంలో 3 రాష్ట్రాలు ఈ ఘనత సాధించగా.. అందులో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం కింద రాష్ట్రానికి నిధులు అందాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### రైతులకు ప్రత్యేక ఐడీ నెంబర్

ఫార్మర్ రిజిస్ట్రీ లక్ష్యాన్ని పూర్తి చేసినందుకు అధికారులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీని తప్పనిసరి చేసింది. రైతులందరూ పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ బాధ్యతను అప్పగించింది. ఇది చేయించుకున్న రైతులకు ఒక యూనిక్ ఐడీ క్రియేట్ అవుతుంది. ఆధార్ కార్డు వివరాల ఆధారంగా ఈ ఫార్మర్ రిజిస్ట్రీ రైతులు చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ నెంబర్ 11 అంకెలు ఉంటుంది. పీఎం కిసాన్ సాయం పొందాలన్నా, ఇక ఇతర రాయితీలు పొందాన్నా ఇందులో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఐడీ పొందటం అనేది తప్పనిసరి. ఇందుకోసం రైతులు అధికారులకు పట్టదారు పాసు బుక్, రిజిస్టర్డ్ ఫోన్ నెంబర్, ఆధార్ అందించాలి. ఇందుకు చివరి తేదీని ఫిబ్రవరి 28గా కేంద్రం నిర్ణయించింది.

### ఎలా చేయించుకోవాలి..?

సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. లేకపోతే సమీపంలోని కామన్ సర్వీసెస్ సెంటర్లను సంప్రదించి కూడా చేసుకోవచ్చు. రైతులు ఐడీ నెంబర్‌ను భద్రంగా ఉంచుకోవాలి. కేంద్రం, రాష్ట్రం నుంచి విత్తన సబ్సిడీ, రుణాలు, నగదు లాంటివి అంతరాయం కలగకుండా పొందటంలో ఉపయోగపడుతుంది. ప్రభుత్వ పథకాలన్నింటికీ ఇది కీలక ఆధారంగా ఉపయోగపడుతుంది. రైతులు గ్రామ ఏఈవోను సంప్రదించి దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు పొందవచ్చు. రైతులకు ప్రత్యేకమైన గుర్తింపు, ప్రయోజనాలను ఈ ఐడీ కల్పిస్తోంది. రైతులందరూ ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం ర్యాలీలు నిర్వహిస్తోంది. అటు ఏపీ ప్రభుత్వం కూడా ఫార్మర్ రిజిస్ట్రీని తప్పనిసరి చేసింది. ఏపీలో కూడా ఈ ప్రక్రియ చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా రైతుల దగ్గరికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఏపీలో కూడా చాలామంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోగా.. ఇంకా కొంతమందివి పెండింగ్‌లో ఉన్నాయ.

# స్లీపర్ బస్సు, ట్రక్కు ఢీ

### ఆరుగురు మృతి




**టీ మీడియా, ఫిబ్రవరి 27, బలోత్రా :**
స్లీపర్ బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఆరుగురు అక్కడికకక్కడే మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ఘటన రాజస్థాన్?లోని బలోత్రాలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రమాదానికి గురైన స్లీపర్ బస్సు శుక్రవారం జోధ్‌పుర్ నుంచి సాంచోర్‌కు బయలుదేరింది. బలోత్రా జిల్లా సర్వాడి గ్రామం సమీపంలోకి రాగానే బస్సు డ్రైవర్? ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. అయితే, డ్రైవర్? వైపు ఉన్న ప్రయాణికులు ఎక్కువగా గాయపడినట్లు పోలీసులు చెబుతున్నారు. స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డవారిని రక్షించారని చెప్పారు. రెండు వాహనాలు అధిక వేగంతో వెలుతున్నప్పుడు ఈ ప్రమాదం జరగడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు.

### డ్రైవర్ బస్సును చాలా వేగంగా నడిపాడు

ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఓ ప్రయాణికుడు అందించారు. "డ్రైవర్ బస్సును చాలా వేగంగా నడిపాడు. వేగాన్ని తగ్గించమని కూడా నేను అతడికి చెప్పాను. ఆ తర్వాత, నా సోదరుడు నేను వెళ్లి వెనుక సీటులో కూర్చున్నాం. ప్రమాదం జరిగిన తర్వాత నేను ఎమర్జెన్సీ డోర్? నుంచి ప్రయాణికులను బయటకు పంపించాను. అందులో కొన్ని మృతదేహాలు కూడా ఉన్నాయి. ఈ ప్రమాదంలో నా సోదరుడి చేయి విరిగింది" ప్రయాణికుడు రమేశ్? విష్ణోయ్ చెప్పారు..కాగా, ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు, ఒక మహిళ ఉన్నారని పోలీసులు తెలిపారు. వారి మృతదేహాలను నహతా ఆస్పత్రిలో మార్చురీలో ఉంచారన్నారు. కాగా, ఈ ఘటనతో హైవే పై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిందని, రెండు వైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయని బలోత్రా ఎస్పీ రమేశ్ కుమార్ పేర్కొన్నారు. వెంటనే స్థానిక యంత్రాగం అక్కడికి చేరుకుని ట్రాఫిక్?ను క్లియర్ చేసిందని పేర్కొన్నారు.

### సంతాపం తెలిపిన ప్రముఖులు

ఇదిలా ఉండగా, ప్రమాద ఘటనపై నాగౌర్ ఎంపీ హనుమాన్ బెనివాల్ స్పందించారు. ఈ ఘటనపై? విచారం వ్యక్తం చేస్తూ ఎక్స్?లో పోస్ట్? చేశారు. 'బలోత్రా జిల్లాలోని కల్యాణ్‌పుర్ సమీపంలో ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురైందని తెలిసింది. ప్రమాదంలో కొంతమంది ప్రయాణికులు మరణించారని, పలువురు గాయపడ్డారన్న వార్త అందింది. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను' అని ఎక్స్?లో రాసుకొచ్చారు. మరోవైపు, ఈ ప్రమాదంపై బైటు ఎమ్మెల్యే హరీశ్ చౌదరి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'బస్సు, ట్రక్కు ప్రమాద వార్త చాలా బాధాకరం. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. అలాగే, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని ఎక్స్?లో పోస్ట్? చేశారు.

# పక్కాగా ధాన్యం లెక్క

- మిల్లర్ల పై మంత్రి ఉత్తమ్ సీరియస్
- ప్రత్యేక బృందాలతో స్టాక్ తనిఖీలకు ఆదేశం



**టీ మీడియా ,ఫిబ్రవరి 27 ,హైదరాబాద్:**
ఇప్పటివరకు ఒక లెక్క, ఇప్పటి నుంచి మరో లెక్క.. అనే రీతిలో పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కఠినంగా వ్యవహరిస్తున్నారు. పౌర సరఫరాల విభాగాన్ని ప్రక్షాళన చేయాలనే ఉద్దేశంతో మంత్రి పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా.. 2024- 25 రబీ సీజన్‌లో మిల్లర్ల నుంచి రావాల్సిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) విషయంలో కఠినంగా వ్యవహరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. మిల్లర్ల వద్ద నుంచే ధాన్యం మాయమవుతున్నదని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో.. అసలు ధాన్యం స్టాక్ ఉందా, ఉంటే ఎంత ఉంది.. ఇంకెంత సీఎంఆర్ రావాల్సి ఉందనే పక్కా సమాచారాన్ని రాబట్టేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ బృందాలతోపాటు, ఎఫ్‌సీఐ బృందాలు కూడా ఈ స్టాక్ తనిఖీల్లో వేర్వేరుగా పాలుపంచుకుంటున్నాయి.

### 28తో గడువు ముగింపు..

25 సీజన్‌లో రబీ పంటకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 8,378 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిల్లులకు మిల్లింగ్ కోసం సరఫరా చేసింది. అయితే ఇందు లో ఇప్పటివరకు సుమారు 70 శాతం వరకు మాత్రమే కస్టమ్ మిల్లింగ్ రైస్ రూపంలో ప్రభుత్వ గోదాములకు చేరుకుంది. మిగిలిన 30 శాతం బియ్యం రావాల్సి ఉంది. అయితే 2024 సీజన్‌లో రబీకి సంబంధించిన సీఎంఆర్ ఇవ్వడానికి గడువు ఈనెల 28తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మిల్లర్లు తమకు మరింత గడువు కావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తాజాగా ఢిల్లీ పర్యటనలో భాగంగా 2024-25 రబీ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ ఇవ్వడానికి మరో 2 నెలల గడువు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. అయితే క్షేత్రస్థాయిలో ధాన్యం నిల్వలు ఉన్నాయా, ఉంటే అవి ఏ మేరకు ఉన్నాయనే అంశాన్ని నిర్ధారిస్తేనే గడువు పెంచేందుకు అవకాశం ఉంటుందని కేంద్రంలోని అధికారులు స్పష్టంచేశారు.

### స్పష్టమైన ఆదేశం..

ఇప్పటికే మిల్లర్లు ధాన్యం నిల్వలను మా యం చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినపడుతున్న నేపథ్యంలో మంత్రి ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డి దీనిపై దృష్టి సారించారు. పౌర సరఫరా ల విభాగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని కంకణం కట్టుకున్న మంత్రి ఉత్తమ్.. ఇదే అదనుగా అసలు ధాన్యం నిల్వలు ఎన్ని ఉన్నా యో తనిఖీలు చేసి తేల్చాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఈ తనిఖీలకు పురమాయించారు.

పైగా తనిఖీలకు వెళ్ళే బృందాలు వారి సొంత జిల్లాల్లో కాకుండా.. ఇతర జిల్లాలకు వెళ్ళాలని, రైస్ మిల్లర్లు చేసే మర్యాదలను తృణీకరించాలని స్పష్టంగా చెప్పడంతో.. ఆయా బృందాలు సొంతంగా ఏర్పాటు చేసుకుని మరీ తనిఖీలు నిర్వహిస్తున్నారు. 2024 రబీ సీజన్‌లో 74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు ఇస్తే.. ఇప్పటివరకు అందులో నుంచి సుమా రు 70 శాతం వరకు బియ్యం రూపంలో ప్రభుత్వ గోదాములకు చేరింది.


మిగిలిన ధాన్యం ఆయా మిల్లుల్లో ఉందా.. లేదా అనేది ఈ తనిఖీలు ముగిసిన తరువాత తేలనుంది. ఆయా మిల్లులకు కేటాయించిన ధాన్యం ఎం త?, సరఫరా చేసిన సీఎంఆర్ ఎంత?.. మిగిలి న ధాన్యం ఉందా లేదా.. అనేది మిల్లుల వారీ గా తేల్చనున్నారు. ఒకవేళ ధాన్యం మాయమైతే.. ఆయా మిల్లులపై కేసులు కూడా నమోదు చేయాలని మంత్రి ఉత్తమ్ స్పష్టమైన ఆదేశాలు జారీచేయడంతో టాస్క్‌ఫోర్స్ బృం దాలు ఆ పనిలో నిమగ్నమయ్యాయి.

### మరోవంక ఎఫ్‌సీఐ బృందాలు..

ఇదిలా ఉండగా.. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) బృందాలు కూడా మిల్లుల్లో ధాన్యం నిల్వల తనిఖీలకు బయలుదేరాయి. ఇటు టాస్క్‌ఫోర్స్, అటు ఎఫ్‌సీఐ బృందాల తనిఖీల్లో 2024-25 రబీ సీజన్ ధాన్యం నిల్వలు, మరోవంక 2025-26 ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన 71.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో ఎంతవరకు మిల్లర్ల వద్ద ఉన్నాయనేది తేల్చనున్నారు. 2025-26 ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటివరకు కేవలం 10 నుంచి 15 శాతం మాత్రమే సీఎంఆర్ బియ్యం ఇచ్చారు. పూర్తిగా సీఎంఆర్ ఇవ్వడానికి గడువు ఇంకా ఉన్నప్పటికీ.. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తేనే మిల్లర్లు ధాన్యాన్ని మాయం చేసే అవకాశం ఉండదని, అందుకు అనుగుణంగానే ఇటు టాస్క్‌ఫోర్స్, మరోవంక ఎఫ్‌సీఐ బృందాలతో తనిఖీలు చేయిస్తున్నారు. మొత్తానికి పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణ, నిఘా మరింతగా పెరిగితేనే మిల్లర్ల మాయాజాలానికి చెక్ పెట్టవచ్చని ఆలోచించిన మంత్రి ఉత్తమ్.. అందుకు

## వ్యవసాయ
# యాంత్రీకరణకు పెద్దపీట

- రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్
- సీఎం చంద్రబాబు



**టీ మీడియా, ఫిబ్రవరి 27, అమరావతి :**
రాష్ట్రంలోని ఇళ్లు లేని వారందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఉగాదికి ముందే 3 లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయబోతున్నామని చెప్పారు. గృహ నిర్మాణంపై శాసనసభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 2026 చివరికల్లా 10 లక్షల 60 వేల ఇళ్లలో గృహ ప్రవేశాలు జరగాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. గృహ నిర్మాణంలో వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతోందని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం కూడా నిధులు ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు వివరాలు సేకరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఇళ్ల నిర్మాణానికి అదనపు ఆర్థిక సాయం చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు భద్రత, భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. 2019కి ముందు కట్టిన ఇళ్లను గత ప్రభుత్వం కక్షగట్టి ఆపేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఆపేసిన ఇళ్లనూ త్వరలోనే పూర్తిచేసి ఇస్తామన్నారు. 2029లోగా అందరికీ ఇంటిస్థలాలు, ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

### - ఉద్యాన పంటల్లో రాయలసీమను నెంబర్‌వన్

అనంతరం వ్యవసాయరంగ బడ్జెట్‌పై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఉద్యాన పంటల్లో ప్రపంచంలోనే రాయలసీమను నెంబర్‌వన్‌గా చేస్తామని తెలిపారు. రాయలసీమలో ఉద్యాన పంటల దిగుబడుల్ని 400 మిలియన్ మెట్రిక్ టన్నుల నుంచి వెయ్యి మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచుతామన్నారు. ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో వ్యవసాయరంగం తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచసూత్రాల ద్వారా వ్యవసాయ అభివృద్ధికి చర్యలు చేపట్టామని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తున్నామని, కృత్రిమ మేథ వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. రైతు ఆత్మహత్యలు జరక్కుండా చర్యలు చేపట్టామని చంద్రబాబు ప్రకటించారు. వ్యవసాయంలో సాంకేతికత ఉపయోగించి రైతులను లాభాలబాట పట్టించడం, రాయలసీమలో లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి నీటి భద్రత కల్పించడంతో పాటు డిమాండ్ ఆధారంగా పంటలు వేయడం, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్, ప్రభుత్వ మద్దతు అనే పంచసూత్రాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్సీపీ హయాంలో రైతు భరోసా రూ.7500 మాత్రమే ఇచ్చారని, కూటమి ప్రభుత్వం దాన్ని రూ.14 వేలకు పెంచిందని చెప్పారు. రైతుల ఆత్మహత్యలు తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రాష్ట్రానికి 14 వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం విస్తరించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

### -జాతీయ జీడీపీలో 10 శాతం వాటా మన రాష్ట్రానిదే

వైఎస్సార్సీపీ హయాంలో సాగురంగంలో తీవ్రంగా నష్టపోయాం. వ్యవసాయంలో జాతీయ జీడీపీలో 10

3లో..

## లిక్కర్ పాలసీ కేసులో...
# కేజ్రీవాల్, సిసోడియాకు విముక్తి

- కోర్టు బయట ఏడ్చిన కేజ్రీవాల్




**టీ మీడియా, ఫిబ్రవరి 27, న్యూఢిల్లీ:**
ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు ఉపశమనం కలిగింది. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ , మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాపై ఉన్న ఆరోపణలను కొట్టిపారేశారు. ఆ ఇద్దరికీ ఆ కేసులో నమోదు అయిన అభియోగాల నుంచి విముక్తి లభించింది. మద్యం విధానాన్ని రూపొందించే క్రమంలో అవినీతి జరిగినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఢిల్లీ కోర్టు పేర్కొన్నది. ఎక్సైజ్ పాలసీ రూపకల్పనలో ఎటువంటి కుట్ర కానీ, నేరపూరిత ఉద్దేశం కానీ లేదని ఢిల్లీ కోర్టు ఇవాళ వెల్లడించింది. కేజ్రీవాల్, సిసోడియాపై ఆధారాలను ప్రవేశపెట్టడంలో ప్రాసిక్యూషన్ విఫలమైనట్లు కోర్టు తెలిపింది.

మద్యం కుంభకోణం కేసును సీబీఐ దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. ఎక్సైజ్ శాఖ పాలసీలో చోటుచేసుకున్న అక్రమాల్లో ఆ ఇద్దరి పాత్ర ఉన్నట్లు సీబీఐ ఆరోపించింది. కానీ విచారణ సమయంలో పక్కా ఆధారాలను చూపించలేకపోయినట్టు కోర్టు చెప్పింది. ప్రస్తుతం ఆ వివాదాస్పద ఎక్సైజ్ చట్టాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. కేవలం అపోహల మీద తీవ్రమైన కేసును వాదించలేమని, ఆరోపణలకు తగిన రీతిలో బలమైన సాక్ష్యాలను

3లో..

# న్యాయ వ్యవస్థపై నమ్మకం నిలబడింది

- కోర్టు తీర్పుపై కవిత



**టి మీడియా, ఫిబ్రవరి 27 ,హైదరాబాద్ బూరో**

దిల్లీ మద్యం పాలసీ వ్యవహారం కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకు భారీ ఊరట లభించింది. ఈ కేసులో విచారణ జరిపిన న్యాయస్థానం నిందితులందరిపైనా ఉన్న కేసులను కొట్టివేసింది. ఈ మేరకు సీబీఐ అభియోగాలు మోపిన 23 మందికి విముక్తి కల్పించింది. ఈ కేసులో కవితతో పాటు దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియాకు కూడా ఊరట లభించింది. నిందితుల పేర్లను డిశ్చార్జ్? చేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. మద్యం కేసులో కోర్టు తీర్పు అనంతరం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కవిత స్పందించారు. 'సత్యమేవ జయతే' అని ఆమె ఎక్స్?లో పోస్టు చేశారు.

**- జైలులో గడిపిన సమయాన్ని ఎవరు తిరిగిస్తారు?**

దిల్లీ మద్యం పాలసీ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుపై కవిత మాట్లాడారు. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో కడిగిన ముత్యంలా బయటకు వస్తానని తెలంగాణ ప్రజలకు తాను మొదటి నుంచీ చెబుతున్నానని ఆమె గుర్తు చేశారు. అందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు తీర్పును వెలువరించిందని తెలిపారు. న్యాయ వ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని కవిత వివరించారు. ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని తాను ఎన్నోసార్లు చెప్పానన్నారు. ఈ కేసు వల్ల తాను, తన కుటుంబం 5 నెలల పాటు క్షోభ అనుభవించామన్నారు. కష్ట సమయంలో తనకు అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తానని పేర్కొన్నారు. తన కుటుంబానికి దూరమై, 5 నెలలు జైలులో గడిపిన సమయాన్ని ఎవరు తిరిగిస్తారని ఆమె ప్రశ్నించారు. కోర్టు తీర్పు రాకుండానే కొందరు అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు.

"మేము ముందు నుంచి ఏదైతే తెలంగాణ ప్రజలకు చెబుతూ వచ్చామో అదేవిధంగా ఇవాళ కోర్టు అందరినీ నిర్దోషులుగా విడుదల చేయడం జరిగింది. ఈ దేశంలో న్యాయవ్యవస్థపై నేను పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముకాకుండా కాపాడింది. రాజకీయపరంగా కేసు పెట్టారని నేను పదే పదే చెప్పిందే నిజమైంది. కడిగిన ముత్యంలా బయటకు వస్తానని నేను ఇంతకు ముందే చెప్పాను. అదేవిధంగా రావడం జరిగింది. నేను జైలులో ఉన్న సందర్భంలో కార్యకర్తలు అనేక సార్లు వారి సొంత డబ్బులు ఖర్చు చేసి దిల్లీకి వచ్చి నాకు, నా కుటుంబానికి అండగా నిలబడ్డారు. వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను"- కవిత, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

**- సరైన ఆధారాలు లేకుండానే కేసులో ఇరికించారు**

విచారణ సందర్భంగా సరైన ఆధారాలు లేకుండానే ఈ కేసులో పేర్లు చేర్చారని విచారణ సందర్భంగా సీబీఐపై రౌస్? అవెన్యూ కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పూర్తిగా లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని మండిపడింది. నిందితులు తప్పు చేశారనటానికి సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. తగిన ఆధారాలు లేకుండానే కేసులో ఇరికించారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ విషయంలో సీబీఐ అధికారులపైనే దర్యాప్తు జరగాలని అభిప్రాయపడ్డారు. కవిత ఆడిటర్ బుచ్చిబాబు సహా ఇతర నిందితులందరిపై సీబీఐ కేసులు కొట్టివేసింది. నిందితుల డిశ్చార్జ్ పిటిషన్లపై కోర్టులో 45 రోజుల పాటు వాదనలు సాగాయి.

**-నాకు ఈ కేసుతో సంబంధం లేదని ఎన్నోసార్లు చెప్పా**

దిల్లీ మద్యం కేసులో తనకు ఏమాత్రం సంబంధం లేదని ఎన్నోసార్లు చెప్పానని, తాను అన్నదే నిజమని ఇవాళ కోర్టు తీర్పుతో తేలిందని కవిత అన్నారు. కొన్ని నెలలపాటు జైలులో ఉంచి మానసికంగా వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు తెలకుండానే వ్యక్తిత్వ హననం చేశారని మండిపడ్డారు. తనపై పెట్టిన కేసువల్లే బీఆర్ఎస్? ఓడిపోయిందన్నట్లుగా తన అన్న కేటీఆర్? పోస్టుచేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి తాను కారణమా? అని ఆమె కేటీఆర్?ను ప్రశ్నించారు. ప్రజలకు ఇళ్లు ఇవ్వకపోవటం, ఉద్యోగాలు ఇవ్వకపోవటం బీఆర్ఎస్ ఓటమికి కారణమన్నారు.

**- మూడు నెలల్లో కొత్తపార్టీ పెడుతున్నా**

అభ్యర్థులను మార్చకుండా మళ్లీ వాళ్లకే టికెట్లు ఇవ్వటం బీఆర్ఎస్ ఓటమికి ఓ కారణమని కవిత అన్నారు. దోపిడీదారులకే మళ్లీ టికెట్లు ఇచ్చి ప్రజలపై రుద్దే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అన్నింటికంటే ముఖ్యంగా వారి అహంకార ధోరణే పార్టీ ఓటమికి కారణమన్నారు. ఇవాళ కోర్టు తీర్పును వారికి అనుకూలంగా మార్చుకుని మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఓటమిని తన మెడలో వేయాలని చూడటం కరెక్ట్ కాదన్నారు. మరో మూడు నెలల్లో కొత్త పార్టీ పెట్టబోతున్నానన్నారు. తనపై పెట్టిన కేసులపై మూడేళ్లుగా ఒంటరిగానే పోరాడుతున్నానని కవిత తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి నాకు ఎప్పుడూ మద్దతు రాలేదన్నారు. పార్టీ పెట్టే ముందే కోర్టు తీర్పు రావటం సంతోషకరమన్నారు.

## హెచ్పివి టీకా పంపిణీ చారిత్రాత్మక నిర్ణయం

- జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వారణాసి కల్పన

**టీ మీడియా, వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 2:**



వనపర్తి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వారణాసి కల్పన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బాలికలను సర్వైకల్ క్యాన్సర్ /గార్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ నుంచి రక్షించడం కోసం క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు ఉచిత హెచ్పివి టీకా పంపిణీ చేయాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా14 నుంచి 15 సంవత్సరాల లోపు బాలికలకు వేయించటం జరుగుతుంది. ఈనెల ఫిబ్రవరి 28 నుంచి అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ప్రారంభం కావటం జరుగుతుంది. తెలంగాణలో 3. 30 లక్షల మందికి టీకా పంపిణి కార్యక్రమం ఉంటుంది.కాబట్టి తల్లిదండ్రులు ఆడపిల్లలకి అవగాహన కల్పించి తప్పనిసరిగా టీకాను వేయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. టీకా వేయించినట్లయితే భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ రాకుండా ఉంటుంది. టీకా పై ఎలాంటి అపోహాలు పెట్టుకోకుండా వేయించండి ఆడపిల్లల భవిష్యత్ బాగుండాలనే ఉద్దేశంతో టీకా వేస్తున్నారు. కాబట్టి టీకా వేయించి మన పిల్లల భవిష్యత్తును కాపాడుకుందాం ఈ మధ్యకాలంలో మహిళలు ఎక్కువగా సర్వైకల్ క్యాన్సర్ బారినపడి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ పై అవగాహన లేకపోవడంతో చాలామంది దీని బారిన పడుతున్నారని ముందుగానే టెస్ట్ చేయించుకున్నట్లయితే ప్రాణాలు రక్షించుకోవచ్చు అన్నారు. టెస్ట్ చేయించుకోవడానికి భయపడుతున్నారు భయపడకుండా ప్రభుత్వ హాస్పిటల్ లో ఉచితంగా టెస్ట్ చేస్తున్నారు చేయించుకోవాలి ఇంట్లో మహిళలు బాగుంటేనే ఆ కుటుంబం బాగుంటుంది కాబట్టి భవిష్యత్తులో ఆడబిడ్డలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా వారికి మంచి జీవితం ఉండాలనే ఉద్దేశంతో మోడీ ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. టీకాను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## భూమి పూజ కార్యక్రమం

**టీ మీడియా, ఫిబ్రవరి 27,వనపర్తి ప్రతినిధి:**



వనపర్తి శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామం కుంటివాని తాండలో వార్డు సభ్యులు లోక్య నాయక్ ఆహ్వానించిన్నందుకు గండదీపం, గరుడస్తంభం భూమిపూజ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్. తాటిపాముల గ్రామ సర్పంచ్ శిరీష మధు పాల్గొన్నారు.కుంటివాని తాండలో అభివృద్ధి పనులు లోక్య నాయక్ చెప్పడడం అభినందించదగ్గ విషయం అన్నారు. రాజు నాయక్, బరికి చంద్రయ్య గృహప్రవేశం చేసిన సందర్భముగా వారి ఇళ్లను సందర్శించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తండా వార్డు సభ్యులు లోక్యా నాయక్, మాజీ సర్పంచ్ సత్యం యాదవ్,వార్డు సభ్యులు వెంకటేష్, సురేష్, చంద్రాయుడు, బుచ్చన్న మాజీ ఉపసర్పంచ్ బాలరాజు, కుమ్మరి ఆంజనేయులు, భాస్కర్ ,రాములు, హరికృష్ణ,నాగరాజు, రాజు నాయక్, డా.నారాయణ్. సుధాకర్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## లో వోల్టేజ్ సమస్యకు చెక్

- మున్సిపల్ చైర్మన్

**టీ మీడియా ,ఫిబ్రవరి 27పెబ్బేరు:**




శుక్రవారం పెబ్బేరు పట్టణంలోని 11వ వార్డులో దీర్ఘకాలంగా వేధిస్తున్న లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి మున్సిపల్ యంత్రాంగం నడుం బిగించిందిపెరుగుతున్న విద్యుత్ అవసరాల దృష్ట్యా నూతనంగా ఏర్పాటు చేయనున్న ట్రాన్స్‌ఫార్మర్ కోసం మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ 11వ వార్డు కౌన్సిలర్ పర్వీన్ షకీల్ విద్యుత్ శాఖ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేపట్టారు స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు అనువైన స్థలాన్ని గుర్తించామని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## న్యాయవాదులకు రక్షణ కరువు

- రిలే దీక్షలకు మాజీ మంత్రి మద్దతు

**టీ మీడియా, ఫిబ్రవరి 27 , వనపర్తి ప్రతినిధి :**



మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి గత నాలుగు రోజులుగా న్యాయవాదులు తమ రక్షణ కోసం చట్టం కావాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజములో పెదధోరణుల వల్ల న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందని రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.ఎటువంటి కేసునైనా నేను వాదించను అనే హక్కు న్యాయవాదికి లేదని కక్షిధారునికి న్యాయం చేయడమే న్యాయవాది వృత్తి ధర్మమని అంతమాత్రాన కక్ష్య పెంచుకొని దాడులు చేయడం అవివేకమని ఆయన పేర్కొన్నారు.సమాజ నడవడిక ఎట్లా ఉన్నా యువ న్యాయవాదులు సీనియర్ న్యాయవాదుల సలహాలతో న్యాయాన్ని నిలబెట్టాలని అన్నారు.వృత్తిలో ఈర్ష్య దేశాలు వదలి తమ ప్రవీణ్యతతో మంచి పేరు తెచ్చుకోవాలని కోరుతూ న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి మా పూర్తి మద్దతు ఉంటుందని నిరంజన్ రెడ్డి అన్నారు.

## పారిశుధ్యం పై రాజీ పడేది లేదు

**టీ మీడియా ఫిబ్రవరి 27పెబ్బేరు:**



పెబ్బేరు పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నివారణకు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వార్డు కౌన్సిలర్ లు తెలిపారు 5వ వార్డుల్లో కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు జాగ్రత్తగా పట్టణంలోని అన్ని వార్డులలో హైపో క్లోరైడ్ ద్రావణం చల్లించడంతో పాటు డ్రెయినేజీల్లో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు ప్రతి వీధిలోనూ సాయంత్రం వేళల్లో ఫాగింగ్ యంత్రాల ద్వారా పొగ వదిలేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్రా ఎల్లరెడ్డి కౌన్సిలర్ లు భాగ్యలక్ష్మి శివ తాటికొండ క్రిష్ణ దాసరి జమ్ములమ్మ మున్సిపాలిటీ కమిషనర్ అరుపుద్దీన్ హెల్త్ ఇన్స్పెక్టర్ పారిశుద్ధ్య సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పంచాయతీ భవనాలకు శంకుస్థాపన

**టీ మీడియా ఫిబ్రవరి 27, టేక్మాల్ ప్రతినిధి:**




టేక్మాల్ మండల పరిధిలోని సంగ్యా తండా . సర్మోనికుంట తండా గ్రామ పంచాయతీలకు నూతన భవన నిర్మాణాల కోసం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది.నిధుల మంజూరు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సర్పంచులు కోరగా, ఆయన వెంటనే స్పందించి ఒక్కో భవనానికి 20 లక్షల రూపాయల చొప్పున మొత్తం 40 లక్షల రూపాయలను మంజూరు చేశారు.శంకుస్థాపన చేసిన వారు టేక్మాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్, మాజీ అధ్యక్షులు సుబేదార్ మణికిషన్, జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ అధ్యక్షులు భక్తుల కిషోర్.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు అధికారులు పాల్గొన్నారుహసన్ మహమ్మద్ పల్లి సర్పంచ్ చందు నాయక్, రవి, సాయిబాబా, సాయిలు, చందర్, శంకర్, రమేష్ ఏఈ రమేష్, పంచాయతీ కార్యదర్శులు నర్సింలు, నాగరాజు. పాల్గొన్నారు.

# ప్రజా వాణి'లో సమస్యలు చెప్పుకోవాలనుకుంటున్నారా?

- కలెక్టరేట్‌కు అవసరం లేదు
- ఈ నంబర్‌కు వాట్సప్ చేస్తే చాలు

**టి మీడియా, ఫిబ్రవరి 27 ,హైదరాబాద్ బూరో :**



ప్రజలు తమ సమస్యలను తెలియజేసేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ నేపథ్యంలో వినతులు సమర్పించేందుకు, సమస్యలు, ఇబ్బందుల పరిష్కారానికి హైదరాబాద్? కలెక్టరేట్? కార్యాలయానకి ప్రతి సోమవారం రానవసరం లేదని అధికారులు తెలిపారు. దీనికి బదులుగా ప్రజలకు మరింత చేరువయ్యేందుకు వాట్సప్?లోనే సేవలందించేందుకు సిద్ధమయ్యారు. ఈ వాట్సప్? నంబరుకు వినతులు, సమస్యలు పంపితే సరిపోతుంది. ఇక్కడి నుంచే వాటిని పరిశీలిస్తామని అధికారులు చెబుతున్నారు.

**వాట్సప్ ఫిర్యాదులకు ఈ నంబరును సేవ్? చేసుకోండి**

ప్రభుత్వానికి వినతులు పంపాలనుకునే వారు 74166 87878 నంబరును సేవ్? చేసుకోవాలి. ఈ నంబరుకు సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, పత్రాలు, ఫొటోలు, వీడియోలను పంపించాలి. ఇలా చేస్తే కలెక్టర్? కార్యాలయంలోని ఐటీ విభాగం వీటిని పరిశీలించి కలెక్టర్? సహా ఉన్నతాధికారులకు చేరవేస్తుంది. ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిశీలించాక వాట్సప్? ద్వారానే అధికారులు సమాధానం ఇస్తారని చెబుతున్నారు.

**కార్యాలయాల చుట్టూ తిరగకుండా**

గత మూడు నెలలుగా జిల్లాలో 1204 ఫిర్యాదులు అందాయని అధికారులు అంటున్నారు. అయితే వాటిలో వాట్సప్? ద్వారా 410 ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించారు. ప్రజావాణి కోసం హైదరాబాద్?లోని వారు ప్రతి సోమవారం లక్డీకాపూల్?లోని కలెక్టరేట్? కార్యాలయానికి వచ్చేవారు. ప్రజలు ఈ విధంగా కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కొద్ది నెలల క్రితమే ఈ వాట్సప్? సేవలను అందుబాటులోకి తెచ్చింది.

**ఫైల్ నంబరు జాగ్రత్త**

వాట్సప్?లో ప్రజావాణి నంబరుకు మెసేజ్?? పంపిన మరుక్షణం మన పేరు, వివరాలు, వినతి, సమస్య వంటి అంశాలను పంపాల్సి ఉంటుంది. వీటన్నింటినీ చాట్?బాట్?కు పంపిన తర్వాత మనకు ఓ ఫైల్ నంబరు వస్తుంది. దీనిని భద్రంగా సేవ్? చేసుకోవాలి. ఈ నంబరు ఆధారంగానే మన వినతి, సమస్యను ఎవరు పరిష్కరిస్తున్నారు? ఎలా పరిష్కరిస్తున్నారు? అనే వివరాలను వాట్సప్ ద్వారా? సులభంగా తెలుసుకోవచ్చు. అన్నీ పూర్తయ్యాక ఫిర్యాదుదారులకు వాట్సప్? ద్వారానే సమాధానం అందుతుంది.


**సౌకర్యాన్ని వినియోగించుకోండి**

ప్రజల వినతులను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని హైదరాబాద్? కలెక్టర్? హరిచందన పేర్కొన్నారు. దీనికోసమే ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు వాట్సప్? సేవలను అందుబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఈ వాట్సప్? చాట్?బాట్? సౌకర్యాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు.సమస్యలు చెప్పుకొనేందుకు సైదాబాద్, మారేడ్?పల్లి, చాంద్రాయణగుట్ట, పాతబస్తీ వంటి ప్రాంతాల నుంచి కలెక్టరేట్?కు రావాలంటే ప్రజలకు చాలా ఇబ్బంది కలుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ట్రాఫిక్?లోనే సుమారు 45 నిమిషాల నుంచి 1 గంట వరకు పట్టవచ్చని చెప్పుకొచ్చారు. అదే కుటుంబ సభ్యులతో కలిసి రావాలనుకునే వారికి రూ.200 నుంచి రూ.300 వరకు ఆటో ఛార్జీ అవుతుందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకునే వాట్సప్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని తమ ఇళ్ల నుంచే ప్రభుత్వానికి తమ సమస్యలను తెలిపాలన్నారు.ప్రజల వినతులను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఈ వాట్సప్? చాట్?బాట్? సౌకర్యాన్ని ప్రజలందరూ వినియోగించుకోండి. సమస్యలు చెప్పుకొనేందుకు సైదాబాద్, మారేడ్?పల్లి, చాంద్రాయణగుట్ట, పాతబస్తీ వంటి ప్రాంతాల నుంచి కలెక్టరేట్?కు రావాలంటే ప్రజలకు చాలా ఇబ్బంది కలుగుతుంది. ట్రాఫిక్?లోనే సుమారు 45 నిమిషాల నుంచి 1 గంట వరకు పట్టవచ్చు. అదే కుటుంబ సభ్యులతో కలిసి రావాలనుకునే వారికి రూ.200 నుంచి రూ.300 వరకు ఆటో ఛార్జీ అవుతుంది." - హరిచందన, కలెక్టర్, హైదరాబాద్.

## చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు

- రంగరాజన్ తండ్రి సౌందర్ రాజన్ మృతి

**టి మీడియా, ఫిబ్రవరి 27 ,హైదరాబాద్ బ్యూరో :**



చిలుకూరు పేరు వింటేనే ఒక నిశ్శబ్ద ఆధ్యాత్మిక విప్లవం గుర్తుకొస్తుంది. ఆ విప్లవానికి ఊపిరి పోసిన వ్యక్తి సౌందర రాజన్. 90 ఏళ్ల వయస్సులోనూ ఆలయ ధర్మం కోసం, సనాతన సంప్రదాయాల రక్షణ కోసం ఆయన చూపిన పట్టుదల సాటిలేనిది. కేవలం పూజారిగానే కాకుండా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే గొంతుకగా ఆయన గుర్తింపు పొందారు.

**దేవుడు వ్యాపార వస్తువు కాదు**

దేవుడు వ్యాపార వస్తువు కాకూడదు అనేది ఆయన ప్రగాఢ విశ్వాసం. ఈ క్రమంలోనే ఆయన సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. 1998లో ఆలయాలపై ప్రభుత్వ పెత్తనాన్ని ఎదిరించి చిలుకూరు గుడిలో హుండీని తొలగించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. కేవలం వాక్ ) పత్రిక ద్వారా వచ్చే ఆదాయంతోనే ఆలయ నిర్వహణ సాధ్యమని నిరూపించారు. భక్తుల జేబులో చెయ్యి పెట్టని దేవుడు అనే భావనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు.

సౌందర రాజన్ కేవలం ఆధ్యాత్మిక వేత్త మాత్రమే కాదు, గొప్ప విద్యావేత్త కూడా. గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్‌గా సేవలు అందించిన ఆయన, తన మేధస్సును ధర్మ రక్షణకు ఆయుధంగా మలుచుకున్నారు. గుడిలో వి.ఐ.పి దర్శనాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ధనిక-పేద తేడా లేకుండా అందరినీ ఒకే వరుసలో నిలబెట్టిన ఘనత ఆయనది.2006లో ప్రభుత్వం చిలుకూరు ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించినప్పుడు ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కావాలంటే తాళాలు తీసుకెళ్లి ముఖ్యమంత్రికే ఇచ్చేస్తా అంటూ ధైర్యంగా నిలబడ్డారు. టెంపుల్ ప్రొటెక్షన్ మూవ్‌మెంట్ ద్వారా దేశవ్యాప్తంగా దేవాలయాల విముక్తి కోసం పోరాడారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన నేర్పిన 11 ప్రదక్షిణల సంకల్పం, 108 ప్రదక్షిణల కృతజ్ఞత భక్తుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. ప్రస్తుతం ఆయన వారసుడు సి.ఎస్. రంగరాజన్ తన తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారు.



## పాప మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జేఏసీ కమిటీ

**టీ మీడియా ఫిబ్రవరి 27,కొల్లాపూర్:**

కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ ఆధ్వర్యంలో కుమ్మెర జాతరలో మరణించిన పసిపాప కుటుంబానికి అండగా నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. పసిపాప మృతికి కారణమైన 8 మంది నిందితులను కఠినంగా శిక్షించాల్సి ఉండగా అందులో కేవలం నలుగురిని మాత్రమే అరెస్టు మిగతా నలుగురు పరారీలో ఉన్నారని వారిని పట్టుకోవడంలో ప్రభుత్వం పోలీస్ యంత్రాంగం విఫలమైందని అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలంటే నిందితులకు కఠినమైన శిక్షలు పడాలని నిందితులపై మర్డర్ కేస్ పెట్టాలని వారు డిమాండ్ చేశారు. నిందితులకు శిక్ష పడేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జగ్జీవన్ రావు వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు బోరెల్లి సంగమయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పుట్టపాక రాము, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు మంద నరసింహ, బీసీ నాయకుడు చందన్ గౌడ్, మేకల రాముడు, కలమంద శేఖర్, బీఎస్పీ నాయకుడు బి. దాస్, దళిత దండు నాయకులు మల్లెల వెంకటస్వామి, కోళ్ల బాలస్వామి, చాకలి రవి, కృష్ణయ్య గౌడ్, బంకల మూర్తి, కేశపాక మహేష్, ఎమ్మార్పీఎస్ నాయకుడు శీలం కురుమయ్య, శీలం వెంకటేష్, పసుపుల కురుమయ్య, పగిడాల బాలకృష్ణ, పాల్గొన్నారు.



## మున్సిపల్ కౌన్సిలర్ మార్నింగ్ వాక్


**టీ మీడియా, ఫిబ్రవరి 27, వనపర్తి బ్యూరో :**

వనపర్తి వనపర్తి జిల్లా కేంద్రం 28 వార్డ్ వెంగళరావు కాలనీలో పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా నిత్యం కాలనీలో ఉంటూ కాలనీ పరిశుభ్రతకై కృషి చేస్తున్న 28వ వార్డ్ కౌన్సిలర్ కోట్ల శిరీష రవి. వార్డులో ప్రతిరోజు మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తోంది. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి 28 వార్డులో పర్యటించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం తెలిపారు. ప్రజలు కార్యాలయాలకు వెళ్లే పనిలేకుండా ఉదయాన్నే తమ వీధిలోకి వస్తున్న కౌన్సిలర్ కి ప్రజలు తమ సమస్యలను నేరుగా విన్నవించుకుంటున్నారు. 28వ వార్డులో నడక సాగిస్తూనే డ్రైనేజీ వ్యవస్థ, చెత్త సేకరణ, వీధి దీపాల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. సమస్యలు ఉన్నచోట మున్సిపల్ సిబ్బందికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. కౌన్సిలర్ మా సమస్యలను ఓపిగ్గా వినడం చాలా సంతోషంగా ఉంది అని కాలనీ ప్రజలు తెలిపారు. ఇలాంటి చొరవ వల్ల పట్టణం త్వరగా అభివృద్ధి చెందుతుందని వార్డు ప్రజలు కోరుకుంటున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ మాట్లాడుతూ ఈ మార్నింగ్ వాక్ ద్వారా ప్రజలకు చేరువవ్వడమే కాకుండా పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచడానికి కృషి చేస్తూ వార్డు ప్రజల నుంచి వచ్చే ఈ అపూర్వ స్పందన నాకు మరింత బాధ్యతను పెంచిందన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదాలు

- జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు డీకే మాదిగ

**టీ మీడియా, ఫిబ్రవరి 27, కొల్లాపూర్:**



కొల్లాపూర్ నియోజక వర్గంలో ప్రతి మండల కేంద్రాలలోని ప్రతి గ్రామాల్లో టర్నింగ్ పాయింట్లలో, హెచ్చరిక సూచనలతో బోర్డులు లేకనే కొల్లాపూర్ మండల కేంద్రంలో గాని, మరి వివిధ మండలాలకు సంబంధించిన గ్రామాల్లో గాని టూవీలర్స్ మరియు ఫోర్ వీలర్స్ వెహికల్ మీద వచ్చే వారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి కాబట్టి. ఈ ప్రమాదాలకు ఆర్ అండ్ బి అధికారులు నైతిక బాధ్యత వహించాలని డీకే మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. ఏది ఏమైనా ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్య కారణంగానే ఈ ప్రమాదాలు జరుగుతున్నందుకు, ఇప్పటికైనా అధికారులు మేల్కొని, పుణ్యక్షేత్రాలకు వెళ్లే రహదారులు అనగా సోమశిల, సింగోటం, మరి ఈదమ్మ జాతరకు వెళ్లి రహదారుల వెంట ఉండే, టర్నింగ్ పాయింట్లలో హెచ్చరికలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేసి మళ్లీ ప్రమాదాలు పునరావతం కాకుండా చూసుకునే నైతిక బాధ్యత ఆర్ అండ్ బి అధికారులపై ఉందని, డీకే మాదిగ సూచించారు. అయితే వాస్తవంగా కొల్లాపూర్ టౌన్ పరిధిలో గాని, మండల పరిధిలో గాని, గ్రామాల పరిధిలో గాని, పెళ్లిళ్లకు, పేరంటాలకు, చావులకు, పుట్టినరోజులకు, పెద్ద పెద్ద ఫ్లెక్సీలు రోడ్లమీద పెట్టుకోవడానికి, అనుమతులిస్తున్న, వారిపై కఠిన చర్య తీసుకోవాలని డికే మాదిగ అధికారులకు విజ్ఞప్తి చేశారు. చావుకు కారణం అవుతున్న హెచ్చరిక బోర్డులు లేనందుకు, ఆర్ అండ్ బి అధికారులు వెంటనే స్పందించి! కొల్లాపూర్ నియోజక వర్గంలో ప్రతి టర్నింగ్ పాయింట్ల లో హెచ్చరికతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు డీకే మాదిగ "ఆర్ అండ్ బి అధికారులను" ఒక ప్రకటనలో కోరడం జరిగింది. డికే మాదిగ బిఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొల్లాపూర్ నియోజక వర్గ సోషల్ మీడియా కన్వీనర్.

# మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ

- రైతాంగ సాయుధ పోరాటం నుంచి నేటి వరకు

**టి మీడియా, ఫిబ్రవరి 27 ,హైదరాబాద్ బూరో :**

తెలంగాణ ప్రాంతంలో విప్లవానికి ఊపిరి పోసిన రైతాంగ సాయుధ పోరాటం, నిజాం కాలం నాటి నుంచి మలి దశలో మావోయిస్టు ఉద్యమ విస్తరణ వరకు ఈ గడ్డపై తుపాకీ గొట్టం వినిపించని రోజు లేదు. కానీ కాలక్రమేణా మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ నేడు మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఉమ్మడి రాష్ట్రంలో వెట్టిచాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా మొదలైన సాయుధ రైతాంగ పోరాటం, ఈ గడ్డపై విప్లవ బీజాలుగా ఏర్పడింది. ఆ తర్వాత మరో దశకంలో కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలోని పీపుల్స్?వార్ గ్రూప్ ఈ ప్రాంతాన్ని తన కంచుకోటగా మార్చుకుంది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలు విప్లవ భావజాలానికి కేంద్ర బిందువులయ్యాయి. వేలాది మంది యువత అడవి బాట పట్టి, సాయుధ పోరాటమే సమస్యలకు పరిష్కారమని నమ్మారు. అప్పటి నుంచి తాజా పరిణామాల వరకు ఓసారి మావోయిస్టు ఉద్యమ చరిత్రను పరిశీలిద్దాం.

**- అడవులు, కొండలను కంచుకోటగా మార్చుకుని**

మావోయిస్టులు ఒకానొక దశలో ఉమ్మడి రాష్ట్రంలో పలు గ్రామాల్లో 'జనతన సర్కార్' పేరుతో సమాంతర ప్రభుత్వాలను నడిపారని గతంలోనే పోలీస్ అధికారులు గుర్తించారు. భూ పంపిణీ, గిరిజన సమస్యల పరిష్కారం లాంటి అంశాలతో ప్రజల్లో పట్టు సాధించారు. పోలీస్ నిఘా ఉన్నప్పటికీ, దట్టమైన అడవులు, కొండలు మావోయిస్టులకు రక్షణ కవచాలుగా మార్చుకున్నారు. దీంతో పోరాటంతోనే అన్ని రకాల సదుపాయాలు వస్తాయినే భావనను అదివాసులు, ప్రజల్లో మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు కల్పించారు. మావోలు ప్రధానంగా భూ సంస్కరణలు, గిరిజన హక్కులు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం, అడవుల్లో పోలీసుల కూంబింగ్ నిలిపివేత తదితర అంశాలపై అప్పటి వైఎస్సార్ ప్రభుత్వంలో చర్చలు జరిగాయి. మొదటి విడత చర్చలు జరిగాక, భూ సంస్కరణల వంటి అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడం, పరస్పర



దాడుల నేపథ్యంలో ఈ చర్చలు విఫలమయ్యాయి.

**- ఆపరేషన్ కగార్‌తో చెల్లాచెదురైన మావోలు**

2005 జనవరి నాటికి చర్చల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. మావోయిస్టులు తిరిగి అడవుల్లోకి వెళ్లిపోయారు. వైఎస్ఆర్ ప్రభుత్వం మావోయిస్టులపై మళ్లీ నిషేధాన్ని విధించింది. పోలీసులు మునుపెన్నడూ లేనంత తీవ్రంగా కూంబింగ్ నిర్వహించారు. 2005 సెప్టెంబర్‌లో మావోయిస్టు నేత ఆర్కేపై దాడి జరగగా, చిట్టాల ఎన్‌కౌంటర్ నుంచి ఆయన తృటిలో తప్పించుకున్నారు. అదే సమయంలో కీలక నేతలు చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గ్రేహౌండ్స్ దళాల గాలింపు చర్యలను తక్షణమే నిలిపివేయాలని కూడా కోరారు. 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ప్రభుత్వం మావోయిస్టుల ప్రభావాన్ని తగ్గించడానికి రెండు పద్ధతులతో చర్యలను చేపట్టింది. ప్రపంచంలోనే అత్యుత్తమ అటవీ యుద్ధ తంత్రం తెలిసిన గ్రేహౌండ్స్ దళాలను బలోపేతం చేయడం ద్వారా మావోయిస్టుల షెల్టర్లను, రిక్రూట్‌మెంట్‌ను దెబ్బకొట్టారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో బలమైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాకపోకలను అడ్డుకున్నారు. కేవలం బల ప్రయోగంతోనే కాకుండా, ప్రజల కనీస అవసరాలు తీర్చడం ద్వారా వారు మావోయిస్టులకు దూరం అవుతారని అధికారులు భావించారు. అప్పటి నుంచి ప్రతి గ్రామంలో ఇంటికి తాగునీరు అందజేశారు. అట్టడుగు వర్గాలకు ఆర్థిక భరోసాను ప్రభుత్వం ఇచ్చింది. లోతట్టు గ్రామాలకు తారు రోడ్లు వేయడం ద్వారా గిరిజనులను ప్రధాన స్రవంతికి దగ్గర చేసింది. దీంతో పోలీసుల గస్తీ కూడా సులభమైంది. అలాగే కేంద్ర ప్రభుత్వం అపరేషన్ కగార్ పేరుతో మావోయిస్ట్ పార్టీని పూర్తిగా నిర్మూలించాలని భావించింది.

**- వనం వీడి జనంలోకి**

ప్రస్తుతం తెలంగాణలోని మెజారిటీ జిల్లాల్లో మావోయిస్టుల ఉనికి లేకుండా పోయింది. మావోయిస్టు పార్టీకి అత్యంత బలమైన పునాదులు వేసిన నేతలే ఇప్పుడు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలోకి రావడం విశేషం. ఆ పార్టీ పొలిట్?బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇన్‌ఛార్జి దేవ్‌జీ, సెంట్రల్ కమిటీ సభ్యుడు రాజిరెడ్డి, రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు (దామోదర్), కీలక నేత నూనె నర్సింహా రెడ్డి లొంగిపోవడంతో రాష్ట్రంలో మావోయిస్టులకు దిశానిర్దేశం చేసే నాయకత్వం కనుమరుగైందని పోలీసులు చెబుతున్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి మావోయిస్ట్ పార్టీ సుదీర్ఘకాలం జనరల్ సెక్రటరీగా పని చేశారు. ప్రస్తుతం ఆయన ఎక్కడ ఉన్నారనే సమాచారం మాత్రం బయటకు రావడం లేదు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన గడువు కంటే ముందే తెలంగాణ రాష్ట్రం మావోయిస్టు రహితంగా మారింది. శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, దీంతో అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఒకప్పుడు తుపాకుల మోతతో దద్దరిల్లిన తెలంగాణ అడవులు, నేడు అభివృద్ధి బాట పడుతున్నాయి. భావజాల వ్యాప్తి కోసం మావోయిస్టులు పట్టణ ప్రాంతాల్లో మేధావుల ద్వారా ప్రయత్నిస్తున్నారనే నివేదికల నేపథ్యంలో పోలీసులు ఇప్పటికీ అప్రమత్తంగానే ఉన్నారు. ఏది ఏమైనా తెలంగాణ చరిత్రలో విప్లవ అధ్యాయం క్రమంగా ముగిసి, సంక్షేమ అధ్యాయం మొదలైందని చెప్పవచ్చు.



# విద్యార్థుల ప్రతిభకు వేదిక

- ఫుడ్ ఫెస్ట్ సైన్స్ ఫెయిర్

**టీ మీడియా, ఫిబ్రవరి 27,పెబ్బేరు :**

శుక్రవారం పెబ్బేరు పట్టణ కేంద్రంలో ఉన్న లిటిల్ స్కాలర్స్ గ్రామర్ స్కూల్ లో శుక్రవారం ఫుడ్ ఫెస్ట్ సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు పాఠశాల ప్రాంగణం విద్యార్థుల ప్రతిభతో కళకళలాడింది ఉదయం నిర్వహించిన ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటుతూ రకరకాల రుచికరమైన వంటకాలను స్వయంగా తయారు చేసి తీసుకొచ్చారు చెఫ్ దుస్తులు ధరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో నిలబడి ఆయా వంటకాలు తయారు చేసే విధానం వాటిలో ఉండే పోషక విలువలు ఆరోగ్య ప్రయోజనాలను సందర్శకులకు వివరించారు చిన్నారుల ఆత్మవిశ్వాసం వంట నైపుణ్యం అక్కడికి వచ్చిన తల్లిదండ్రులు అతిథులను ఆకట్టుకుంది మధ్యాహ్నం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ శాస్త్రీయ నమూనాలు ప్రయోగాలను ప్రదర్శించారు ముఖ్యంగా సౌర వ్యవస్థ చంద్రయాన్ 3 శ్వాసక్రియ వ్యవస్థ కిడ్నీల పనితీరు విసర్జన వ్యవస్థ గుండె వ్యవస్థ పనితీరు షుగర్ బీపీ చెకింగ్ విధానం న్యూటన్ మూడవ గమన నియమం వాటర్ సైకిల్ ట్రాఫిక్ లైట్ సిస్టమ్ స్పీడ్ బ్రేకర్ లైటింగ్ పవన విద్యుత్తు ఉత్పత్తి వంటి అంశాలపై రూపొందించిన మోడళ్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి విద్యార్థులు తమ ప్రాజెక్టుల వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను స్పష్టంగా వివరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జి రామస్వామి ప్రిన్సిపాల్ బి ప్రభావతి ప్రధాన సలహాదారు వెంకటయ్య హాజరై విద్యార్థుల స్టాళ్లను సందర్శించి అభినందించారు అలాగే తల్లిదండ్రులు శ్రేయోభిలాషులు, పాఠశాల అధ్యాపక బృందం పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి ప్రభావతి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రయోగాత్మకంగా నేర్చుకుంటే విషయాలు సులభంగా అర్థమవుతాయని అన్నారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ఆసక్తి క్రమశిక్షణ, పరిశీలన శక్తి అవసరమని సూచించారు ఉపాధ్యాయులు కూడా బట్టి విధానానికి బదులు అనుభవాత్మక బోధనపై దృష్టి పెట్టాలని ఆమె ఉపదేశించారు మొత్తానికి ఫుడ్ ఫెస్ట్ సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసే వేదికగా నిలిచి తల్లిదండ్రులు అతిథుల ప్రశంసలు అందుకున్నాయి పాఠశాల యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపింది.



# విద్యుత్ మీటర్ రీడింగ్ నిలిపివేత

- కార్మికుల సమ్మె నోటీసు
- రాష్ట్ర సహాయ కార్యదర్శి సుంకరి వేణు

**టీ మీడియా, ఫిబ్రవరి 27, వనపర్తి ప్రతినిధి:**

తమ సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేది లేదని, మార్చి 1 నుండి బిల్లింగ్ పనులు పూర్తిగా నిలిపివేస్తామని వనపర్తి జిల్లా విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుంకరి వేణు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ తమ చిరకాల సమస్యల పరిష్కారం కోసం పోరాట బాట పట్టింది. మార్చి 1వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా 'స్పాట్ బిల్లింగ్' పనులను బంద్ చేస్తున్నట్లు యూనియన్ నాయకులు ప్రకటించారు. ఈ మేరకు వనపర్తి జిల్లా విద్యుత్ మీటర్ రీడర్స్ కమిటీ ఒక ప్రకటన విడుదల చేస్తూ, తమ నిరసనకు మద్దతు తెలుపుతూ శుక్రవారం వనపర్తి డి ఈ శ్రీనివాసులు కి వినత పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి సుంకరి వేణు మాట్లాడుతూ?టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు నెలకు ?20,000 నుండి ?25,000 వరకు వేతనం అందుతుండగా, టీజీఎన్పిడిసిఎల్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో కేవలం ?4,000, పట్టణాల్లో ?8,000 మాత్రమే ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నెలకు 16వ తేదీ వరకు ఉన్న బిల్లింగ్ గడువును, ఇప్పుడు 6వ తేదీ లోపు పూర్తి చేయాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తోందని, దీనివల్ల కార్మికులపై భారం పెరిగి వేతనాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. గత 25 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం తమ సేవలను గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రైవేటీకరణపై అభ్యంతరం, కోటి సర్వీసులకు పైగా ఉన్న మీటర్ రీడింగ్ పనుల్లో 50% ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడంపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ జీతంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వ సంస్థ ద్వారా మాకు ఏదో ఒక రోజు మేలు జరుగుతుందని ఇన్నాళ్లూ ఎదురుచూశాం. కానీ పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి" అని వనపర్తి జిల్లా అధ్యక్షుడు యూం.డి. మాసూమ్, కార్యదర్శి సంపత్ కుమార్ మరియు కోశాధికారి దశరథం, సురేష్ ,వేణు, శ్రీనివాసులు , యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

# టీవీకే చీఫ్, నటుడు విజయ్‌కు బిగ్ షాక్.

- విడాకుల పిటిషన్ దాఖలుచేసిన భార్య



**టీ మీడియా, ఫిబ్రవరి 27, చెన్నై:**

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీవీకే పార్టీ అధినేత, నటుడు విజయ్‌కు భారీ షాక్ తగిలింది. విజయ్ నుంచి విడాకులు కావాలని కోరుతూ ఆయన భార్య సంగీత.. చెంగల్పట్టు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒక సినీ నటితో విజయ్‌కు వివాహేతర సంబంధమే కారణమని విడాకుల పిటిషన్‌లో సంగీత పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణకు అంగీకరించిన కోర్టు ఏప్రిల్ 20న కోర్టుకు రావాలని విజయ్‌కు నోటీసులు జారీ చేసింది. నటుడు విజయ్, సంగీత వివాహం 1999లో జరిగింది. విజయ్ ఒక సినీ నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపిస్తూ, ఈ కారణంగానే అతడి నుంచి విడాకులు కోరుతున్నట్లు సంగీత తన పిటిషన్‌లో వివరించారు. రెండేళ్లక్రితం విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతడిపై ఇటీవల బీజేపీ నేత తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నాగేంద్రన్ మాట్లాడుతూ త్రిష ఇంటి నుంచి విజయ్ బయటికి రావాలన్నారు. అయితే, తన వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలకు వాడుతున్నారని విజయ్ విమర్శించాడు. ఈ అంశంపై త్రిష కూడా స్పందించింది. తన వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాల కోసం వాడుకోకూడదని సూచించింది. దీంతో నాగేంద్రన్ తర్వాత క్షమాపణ చెప్పాడు. దీంతో నెమ్మదిగా ఈ అంశం కనుమరుగైనట్లు అనిపించినా.. తాజాగా విజయ్ భార్య విడాకుల పిటిషన్‌తో ఈ ఎపిసోడ్ మళ్లీ చర్చనీయాంశంగా మారింది. నిజానికి విజయ్– త్రిష మధ్య బంధం గురించి చాలా కాలం నుంచి ప్రచారం జరుగుతోంది. ఇటీవల నాగేంద్రన్ వ్యాఖ్యలు, విడాకుల పిటిషన్ అంశం వీటికి బలం చేకూరుస్తోంది. అయితే, త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీ టీవీకే పోటీ చేయనున్న నేపథ్యంలో ఈ అంశం అతడి రాజకీయ భవిష్యత్‌పై ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది.

?

### లిక్కర్ పాలసీ కేసులో...

# కేజ్రీవాల్, సిసోడియాకు విముక్తి

కూడా ప్రవేశపెట్టాలని కోర్టు అభిప్రాయపడింది.

ఈ కేసులో స్పెషల్ జడ్జి జితేంద్ర సింగ్ ఆదేశాలు ఇచ్చారు. కేజ్రీవాల్, సిసోడియాతో పాటు మరో 21 మందిని ఆ కేసు నుంచి డిశ్చార్జ్ చేస్తున్నట్లు చెప్పారు. సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను స్వీకరించేందుకు కోర్టు నిరాకరించింది. ఛార్జ్‌షీట్‌లో చాలా లోపాలు ఉన్నాయని, ఎటువంటి సాక్ష్యాలు లేని అంశాలు చాలా ఉన్నట్లు కోర్టు చెప్పింది.

– నేను అవినీతిపరుడిని కాదు

కేజ్రీవాల్ భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన కంట కన్నీళ్లు ఆగలేదు. లిక్కర్ కేసులో నిందితులు అందరికీ కోర్టు విముక్తి కల్పించిందని, సత్యం గెలుస్తుందని మేం ఎప్పుడూ చెబుతూ వచ్చామని కేజ్రీవాల్ అన్నారు. తానేమీ అవినీతికి పాల్పడలేదన్నారు.

# సిఓ సరస్వతి బాయ్‌ని వెంటనే బదిలీ చేయాలి

- మున్సిపల్ కమిషనర్‌ను కోరిన ఆర్పీలు

**టీ మీడియా, ఫిబ్రవరి 27, వనపర్తి బ్యూరో :**

వనపర్తి పట్టణంలోని అనేకమంది ఆర్పీలను మానసికంగా వేధిస్తున్న సిఓ సరస్వతి బాయ్ ని వెంటనే బదిలీ చేయాలని ఆర్పీలు వనపర్తి మున్సిపల్ కమిషనర్ను కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు కలిసిన ఆర్పీలు సిఓ సరస్వతి వారిపై ఫిర్యాదు చేసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా సివో సరస్వతి 2,5,14,15,18,19,22వ వార్డుల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్పీలను విధి నిర్వహణలో తీవ్రంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్య పరిస్థితుల్లో ఆర్పీలు ఆసుపత్రికి వెళ్లిన శుభ కార్యక్రమాలకు వెళ్లిన, చివరికి చావు బతుకులకు వెళ్లిన కూడా తన అనుమతి తీసుకోవాలని ముఖం జారీ చేస్తుందని మొర పెట్టుకున్నారు. చావు దగ్గర ఉంటే సెల్ఫీ దిగి ఫోటో పంపించాలని, ఆసుపత్రులకు వెళితే ఆసుపత్రి బిల్లులు చూపించాలని తీవ్ర మనోవేదనకు గురి చేస్తుందని వివరించారు. తోటి అధికారులతో మాట్లాడితే కూడా అక్రమ సంబంధాలు అంటగడుతుందని సీఈఓ సరస్వతి భాయ్ వేధింపులు తాళలేక కొందరు ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధమయ్యారని బోరున విలపించారు. సీఈఓ సరస్వతి వేధింపులు తట్టుకోలేక చాలామందికి బీపీ షుగర్ వంటి అనారోగ్య సమస్యలకు గురి అవుతున్నామని తెలిపారు. ఆర్పీల ఆత్మగౌరవాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న సిఓ సర్వస్థితి బాయిని తక్షణమే ఇతర ప్రాంతానికి బదిలీ చేయాలని కమిషనర్ వెంకటేశ్వర్లును కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గంధం మదన్, మెకానిక్ శీను ఆర్ పి లకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆర్పిల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గంధం సరస్వతి, శ్రీలక్ష్మి, బషీరాబేగం, ఖాతూన్, ముంత జయమ్మ, సువర్ణ, శిరీష, వాణి, కమలమ్మ, సాజిదా బేగం, రసీదా బేగం తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట

శాతం వాటా మన రాష్ట్రానిదే. పంచ సూత్రాలు, అగ్రిటెక్ ద్వారా వ్యవసాయాభివృద్ధికి చర్యలు. డిమాండ్ ఉన్న పంటలు పండించేలా రైతులకు అవగాహన కల్పిస్తాం. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహిస్తే పంటలకు మంచి ధర వస్తుంది. ఉచిత విద్యుత్‌కు ఏటా రూ.13,722 కోట్లు ఖర్చు చేస్తున్నాం. భూసారం పెంచేందుకు సూక్ష్మ పోషకాలను రైతులకు పంపిణీ చేస్తున్నాం. రైతు భరోసా పేరుతో వైఎస్సార్సీపీ ప్రభుత్వం మిగతా ప్రోత్సాహకాలు ఆపేసింది. ధాన్యం రైతులకు రూ.10 వేల కోట్లకు పైగా ఇచ్చాం. మేం వచ్చాక రూ.1,670 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించాం. ఎక్కడా రైతుల ఆత్మహత్యలు జరగకుండా చర్యలు చేపట్టాం. రైతుల ఆత్మహత్యకు కారణాలు తెలుసుకుని సమస్య పరిష్కరిస్తున్నాం. వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తున్నాం. సాగురంగంలో ఏఐ, ఆధునిక పరిజ్ఞానం వినియోగిస్తున్నాం. 8 వేలకు పైగా గ్రామాల్లో 15 లక్షల మంది ప్రకృతి సేద్యం చేస్తున్నారు. ప్రకృతి సేద్యం వైపు 40 లక్షల మందిని మళ్లించాలనేది మా లక్ష్యం. భూగర్భ జలాలు పెంచి నీటి నిర్వహణ సమర్థంగా చేపట్టాలి. రైతులు కూడా ప్రభుత్వ విధానాలు అర్థం చేసుకోవాలి. కౌలురైతులు ఎక్కువ విస్తీర్ణంలో పంట వేసి నష్టపోతున్నారు" అని సీఎం చంద్రబాబు తెలిపారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహి స్తున్నాం. రైతులకు ఆధునిక పరికరాల ను పరిచయం ప్రోత్సహిస్తు న్నాం. ఫుడ్ ప్రాసెసింగ్‌పై అధిక దృష్టి పెట్టాం. ప్రకృతి సేద్యాన్ని 50 లక్షల ఎకరా లకు విస్తరిస్తాం. రాయ లసీమలో 20 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ సాగు అవుతోంది. దేశంలోనే అత్యధిక పండ్లు పండే ప్రాంతంగా రాయలసీమ ఉంది. రాయలసీమలో హార్టికల్చర్‌ను 40 లక్షల ఎకరాలకు పెంచుతాం. రాయలసీమ హార్టికల్చర్‌కు రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. ఏలూరు దగ్గర అతిపెద్ద కోకో సిటీ వస్తుంది. ఏజెన్సీలో కాఫీ పంట విస్తీర్ణం పెరుగుతోంది. ఆక్వా ఉత్పత్తిలో దేశంలోనే తొలి స్థానంలో ఉన్నాం. అతిపెద్ద ఆక్వా కల్చర్ హబ్‌గా మన రాష్ట్రం తయార వుతుంది." – సీఎం చంద్రబాబు.


## మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్

# ఏజెంట్లు కావలెను

కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.

అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత, కొత్త వారికి అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.

GSTIN:36FDKPS1308P1ZX

టి-మీడియా
సామాజికం ... ప్రజల పక్షం...
Spot Speed NEWS
T MEDIA
epaper,www.tmedia.net.in YouTube facebook